అధ్వానంగా అంతర్గత రహదారులు

- అడుగడుగునా గుంతలు
- చినుకు పడితే చెరువుగా మారుతున్న రోడ్లు
- డ్రైనేజీల సమీపంలో కోరుకుపోతున్న వైనం
- వాహనచోదకుల్లో కలవరం

పీఎం పాలెం పరిధిలో రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల వర్షాలకు పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. దీంతో ఏ కాలనీకి వెళ్లినా గతుకుల రోడ్లే దర్శనమివ్వడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందంటూ కాలనీవాసులు నిట్టూరుస్తున్నారు.

–పీఎం పాలెం

రోడ్డంతా గతుకులే..

స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వెనుక గల హౌసింగ్ బోర్డు కాలనీలో అంతర్గత రోడ్లు శిథిలస్థితిలో ఉన్నాయి. కాలనీలోని రోడ్డు మలుపులో చెరువును తలపించే భారీ గుంత ఏర్పడింది. ఈ రోడ్డులో రాత్రి వేళ ప్రయాణించాలంటే భయపడిపోతున్నారు. చీకట్లో ఏ గుంతలో పడతామోనని కాలనీవాసులు హడలిపోతున్నారు. వర్షాకాలంలో రోడ్లు చెరువులా మారడంతో ఏది రోడ్డు, ఏది గొయ్యో తెలియక తరచూ ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.


హౌసింగ్ బోర్డు కాలనీలో గతుకులమయంగా రోడ్డు

చినుకు పడినా ప్రయాణం కష్టమే..

ఆర్‌హెచ్ కాలనీకి వెళ్లే రోడ్డు పరిస్థితి ఇలానే ఉంది. ఇక్కడి ఆఖరి బస్టాప్‌నకు వెళ్లే 80 అడుగుల ప్రధాన రహదారిని అనుసంధానం చేస్తూ ఈ రోడ్డు నిర్మించారు. రోడ్డుపై గతుకులు పూడ్చకపోవడంతో కాలనీ వాసులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్రవాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.


ఆర్‌హెచ్ కాలనీకి వెళ్లే రహదారి

కోరుకుపోయి.. ప్రమాదకరంగా..

మెయిన్ రోడ్డు నుంచి హెచ్‌పీసీఎల్ లేఅవుట్‌కు వెళ్లే రహదారిని ఆనుకుని ప్రవహిస్తున్న కాలువ కారణంగా రోడ్డు కోరుకుపోయి, ప్రమాదభరితంగా మారింది. పీఎం పాలెం చుట్టుపక్కల విస్తరించిన కాలనీల్లో రోడ్ల పరిస్థితి దాదాపు ఇలానే ఉంది. ఇప్పటికైనా ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


హెచ్‌పీసీఎల్ లే అవుట్‌కు వెళ్లే మార్గంలో కోరుకుపోయిన రోడ్డు

ఇప్పటికీ కచ్చా రోడ్డే..

కారుషెడ్ కూడలి నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రహదారి ఇప్పటికీ కచ్చా రోడ్డుగానే దర్శనం ఇస్తోంది. వర్షం పడితే ఈ రోడ్డులో ప్రయాణించడం దాదాపు అసాధ్యమే. తప్పనిసరై వెళ్లినా బురదరోడ్డులో వాహనచోదకులు నరకం చూడాల్సిందే.


కారుషెడ్ కూడలి నుంచి హెచ్‌బీ కాలనీకి వెళ్లే రోడ్డు

ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదు



రోడ్లు చాలా దారుణంగా ఉండడంతో గ్రీవెన్స్ సెల్‌లో పలుమార్లు ఫిర్యాదు చేశాం. కాలనీలో రోడ్లు, విద్యుత్, పారిశుధ్య సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా రోడ్ల పరిస్థితిలో మార్పు లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి. – కాశీ ప్రసాద్, పీఎం పాలెం

క్లుప్తంగా

తాటితూరులో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆటంకం

ఉత్సవ కమిటీకి టీడీపీ నాయకుల నోటీసులు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు కూడలిలో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించవద్దని స్థానిక టీడీపీ నాయకులు ఉత్సవ కమిటీ ప్రతినిధులకు నోటీసులు జారీ చేశారు. ఏటా వినాయక చవితి, శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే కూడలిలో ఈ ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆటంకం కలిగించడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు. ఇది సరికాదని ఉత్సవ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ కల్లివానిపాలెంలో పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను ఆనందపురం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.7వేలు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు.

ప్రతి రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాధాన్యం


ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో పాల్గొన్న ప్రొఫెసర్లు

తగరపువలస: ప్రస్తుత ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంతో పరిణతి సాధించి, ప్రతీ రంగంలో దాని ఆవశ్యకతను తెలియజేస్తోందని ఆనందపురం మండలం కొంత్యాం ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీ సెక్రటరీ ప్రసాదరాజు అన్నారు. సోమవారం అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడుతూ ఆరు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమంలో ఏఐ, ఇతర అప్లికేషన్స్ గురించి చర్చించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శంభుప్రసాద్, పుణే నిట్ ప్రొఫెసర్ పి.సాయి ప్రసాద్, కో–ఆర్డినేటర్ ఎస్.శిరీష, రాంకుమార్ తదితర 50 మంది పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ


పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

తగరపువలస: ఆనందపురం మండలం రామవరం పంచాయతీలో పది మంది పేదలకు మేము సైతం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వంద కిలోల బియ్యం పంపిణీ చేశారు. ఇటీవల మృతి చెందిన గనిశెట్టి రాము జ్ఞాపకార్థం సభ్యులు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎర్ర వెంకట అప్పారావు, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కిరెడ్డి దేముడు బాబు, ఉపాధ్యక్షుడు అక్కిరెడ్డి పెంటయ్య, సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు


మందులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

మధురవాడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలను ఆరోగ్యంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికులే నిజమైన హీరోలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మధురవాడ పీహెచ్‌సీ వద్ద జీవీఎంసీ జోన్–1, జోన్–2 పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వారికి ఉచితంగా పరీక్షలు చేయించి, మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ వరదల్లో ప్రజలు అంటురోగాల బారిన పడకుండా పనిచేసిన జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి ప్రశాంతి, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను అధికారులు తొలగించారు. వివరాలివి.. రుషికొండ దరి స్వర్ణభారతి నగర్‌లో ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని రూ.18 లక్షలకు విక్రయించేశాడు. దీంతో కొనుగోలు చేసిన వ్యక్తి యథేచ్ఛగా నిర్మాణం కొనసాగిస్తున్నాడు. దీంతో ఈ ఆక్రమణలపై ఈ నెల 23న సాక్షి దినపత్రికలో 'ప్రభుత్వ స్థలం ఆక్రమణ' కథనంపై రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు స్పందించారు. ఇక్కడ ఆక్రమిత స్థలాన్ని సోమవారం పరిశీలించి, స్థలంలో చేపట్టిన నిర్మాణాలను తొలగించారు. ఇది జీవీఎంసీ పార్కు స్థలం అని తెలిపారు. కొందరు వ్యక్తులు ప్రభుత్వానికి సంబంధించిన ఖాళీ స్థలాలను విక్రయిస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇక్కడి ఆక్రమణలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించినట్లు వీఆర్వో కె.జగదీశ్వరరావు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీ మోహన్ తెలిపారు. మళ్లీ ఇక్కడ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ


మధురవాడలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మధురవాడ: ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ మున్సిపల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా మహాధర్నాలు చేపడుతున్న నేపథ్యంలో కార్యక్రమం పోస్టర్‌ను మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.28,728 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.వి.ప్రసాద్, డి.అప్పలరాజు, సీహెచ్ శేషుబాబు, ఎస్.రాములప్పడు, జి.కిరణ్, ఆదిలక్ష్మి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 13 వినతులు

మధురవాడ: మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఈఈ శాంతిరాజు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 3, ఈఈ వర్క్స్‌కు 4, నీటి సరఫరా విభాగానికి–1, ప్రజారోగ్య శాఖకు 1, రెవెన్యూ విభాగానికి– 4 అర్జీలు వచ్చాయి.

- మధురవాడ కరెంట్ ఆఫీసు పక్కన ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల పరిసరాల్లో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆహార వ్యర్థాలున్న వాహనాలను ఉంచుతున్నారని వార్డెన్ బ్రహ్మానందం ఫిర్యాదు ఇచ్చారు. అంతేకాకుండా అక్కడే వ్యర్థాలను ఒక వాహనం నుంచి మరో వాహనంలోకి మార్చడం వల్ల వస్తున్న దుర్గంధంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.
- రుషికొండ స్వర్ణభారత్‌నగర్ లే అవుట్ పార్కు స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఎ.రాంబాబు, రేవళ్లపాలెం రోడ్డులో పీఎంపాలెం పోలీసు స్టేషన్ దగ్గరలో రోడ్డు సమస్యపై పి. వెంకటరామారావు ఫిర్యాదు ఇచ్చారు.


వినతిని స్వీకరిస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

భీమిలిలో ఐదు వినతులు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు ఐదు వినతులు వచ్చాయి. అర్జీదారుల నుంచి కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు వినతులు స్వీకరించారు. ఇంజినీరింగ్, యూసీడీ, ప్రజారోగ్య విభాగాలకు సంబంధించి వినతులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

నేరెళ్లవలస కాలనీలో తాగునీటికి కటకట

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ నాలుగోవార్డు నేరెళ్లవలస కాలనీ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల మార్గంలో మూడు బోరుబావులు మరమ్మతులకు గురవడంతో పది రోజులుగా స్థానికులు తాగునీటికి కటకటలాడుతున్నారు. గతంలో విలీన పంచాయతీ నిడిగట్టులో ఉన్న ఈ గ్రామం ప్రస్తుతం జీవీఎంసీలో విలీనం అయింది. దీంతో ఇక్కడి జగనన్న కాలనీ వాసులు బోరుబావులకు మరమ్మతులు చేయించాలని భీమిలి మండల పరిషత్ కార్యాలయం, భీమిలి జోనల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా 'మా పరిధి కాదు' అంటూ తప్పించుకుంటున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ఇక్కడ బోరుబావిని ట్యాంకుకు అనుసంధానం చేసి తద్వారా కుళాయిల నుంచి సుమారు వందలాది కుటుంబాలు నీరు వినియోగించుకునేవారు. పదిరోజులుగా తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నా జీవీఎంసీ కనీసం వాటర్ ట్యాంకులు కూడా పంపించ డం లేదని వాపోతున్నారు. నేరెళ్లవలస గ్రామం జీవీఎంసీలో విలీనం అయినందున భీమిలి జోన్ అధికారులే తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.


పాడైన బోరు

శాస్త్ర విజ్ఞానంపై జిజ్ఞాస పెంచాలి


విజయ భాస్కర్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

కొమ్మాది: గణితం, భౌతిక, రసాయన శాస్త్రాల్లో పట్టు ఉన్నప్పుడే సాంకేతిక ప్రగతి సాధ్యపడుతుందని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి. విజయభాస్కర్ అన్నారు. 'నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్' పై గీతంలో నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. పాఠశాలలో సైన్స్ పట్ల ఆసక్తి పెంచడానికి అటల్ టింకరింగ్ ప్రయోగశాలలతో పాటు స్టెమ్ ల్యాబ్‌లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీచర్లు ఈ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై జిజ్ఞాసను పెంచాలన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్. కృష్ణ, డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్ట్‌ల పాత్ర కీలకం


ర్యాలీ నిర్వహిస్తున్న అవంతి ఫార్మసీ విద్యార్థులు

తగరపువలస: హెల్త్‌కేర్ డెలివరీలో ఫార్మసిస్ట్‌ల పాత్ర కీలకమని చెరకుపల్లి అవంతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.బి.వి.రాజు అన్నారు. ప్రపంచ ఫార్మసిస్ట్‌ల దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సవాళ్లు ఎదుర్కోవడంలో ఫార్మసిస్టుల ప్రాముఖ్యత గురించి వివరించారు. ర్యాలీలో ఫార్మా డి, బి.ఫార్మసీ. ఎం.ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ విడుదల


పోస్టర్ విడుదల చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం శ్రీదుర్గాలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. అక్టోబర్ 3 నుంచి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఇంద్రకీలాద్రిపై జరిగే విధంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. 6న అన్నదానం, 11న దుర్గాహోమం నిర్వహిస్తామన్నారు. కమిటీ అధ్యక్షుడు దల్లి రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ దల్లి రామారావు, కార్యదర్శి నగిరెడ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ఈ అధికారులకు శిక్షణ


శిక్షణకు హాజరైన సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ అధికారులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీలో భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖ, ఖర్చుల విభాగం, ప్రొక్యూర్‌మెంట్ పాలసీ విభాగం ఆధ్వర్యంలో సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ (సీపీఎస్ఈ) కు చెందిన అధికారులకు ఐదు రోజుల శిక్షణ సోమవారం ప్రారంభం అయింది. ప్రోగ్రాం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.చటర్జీ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో జరిగే నాలుగు శ్రేణుల ప్రోగ్రాంలో ఇది మొదటిదన్నారు. కాంట్రాక్ట్‌లో అవినీతి, మోసం నిరోధించడానికి, ఎదుర్కోవడానికి వ్యూహాలపై అవగాహన కల్పిస్తామన్నారు. రెడ్ ఫ్లాగ్‌లను గుర్తించడం, జెమ్ ద్వారా వస్తువులు, సేవలను సేకరించడం, కన్సల్టింగ్ సేవలను సేకరించడం, సిద్ధం చేయడం వంటి అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఐఐఎం సీవీవో ప్రొఫెసర్ దీపికా గుప్తా ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం గురించి వివరించారు. శిక్షణకు సీపీఎస్ఈకి చెందిన 44 మంది అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో క్రీడా సంరంభం

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలు ప్రారంభం


వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

తగరపువలస: పాఠశాలల్లో క్రీడా సంరంభం మొదలైంది. మూడు రోజుల పాటు జరగనున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. వీటిని పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు ప్రారంభించారు. మొదటి రోజు అండర్–14, 17 విభాగాలకు చెందిన వివిధ పాఠశాలలకు చెందిన బాలురు యోగా, కబడ్డీ, చెస్, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. అండర్–14 వాలీబాల్ పోటీల్లో భీమిలి కేథరిన్, లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు మొదటి రెండు స్థానాలు సాధించారు. అండర్–17 విభాగాలలో మంగమారిపేట, లక్ష్మీపురం, చిట్టివలస జెడ్పీ హైస్కూళ్లు సెమీ ఫైనల్స్‌కు చేరాయి. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.లలిత్‌కుమార్, సతీష్, మండల కార్యదర్శి చిల్ల వెంకటరెడ్డి, కనకరెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ భాగ్యలక్ష్మి, స్థానిక నాయకులు కొప్పల రమేష్, సూరిబాబు, తాటిపూడి అప్పలరాజు, పిట్ట సురేష్, దొంతల అప్పలరాజు, కొప్పల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పద్మనాభంలో..

పద్మనాభం: మండల స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 24, 25 తేదీల్లో పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవోలు పి.రమణ, ఎస్.డి.బాబులాల్ సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పీడీలతో మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించాలన్నారు. 24న బాలికలకు కస్తూర్బా విద్యాలయంలో, 25న బాలురకు పద్మనాభం గోస్తని విద్యాపీఠంలో పోటీలు నిర్వహించాలని తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, యోగా, అథ్లెటిక్ క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. మరిన్ని వివరాలకు మండల కో–ఆర్డినేటర్ ఎల్.వి.వి.ఆర్.సత్యంను 97047 37384 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ హైస్కూల్స్ పీడీలు పాల్గొన్నారు.

రెడ్డిపల్లి హైస్కూల్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలకు సన్నాహాలు

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్టు హెచ్ఎం ఎం.సన్యాసిరావు తెలిపారు. పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, గ్రామ స్థాయి నాయకులతో పాఠశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలను 1951 సెప్టెంబర్ 19న స్థాపించారన్నారు. 2025 సెప్టెంబర్ 19వ తేదీకి పాఠశాల స్థాపించి 75 ఏళ్లు పూర్తవుతాయని తెలియజేశారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది సెప్టెంబర్ 19న ప్లాటినం జూబ్లీ ఉత్సవం నిర్వహించడానికి ఇప్పటి నుంచే కార్యచరణ రూపొందిస్తున్నట్టు తెలిపారు. 1951 నుంచి తమ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థుల వివరాలు సమీకరిస్తామన్నారు. వచ్చే నెల 20న ఉత్సవ నిర్వహణకు ఒక కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, రెడ్డిపల్లి ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈర్ల ఈశ్వరరావు, బోని సన్యాసినాయుడు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం సన్యాసిరావు

సమయపాలన పాటించని ఆర్టీసీ బస్సులు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోనల్‌లో పలు రూట్‌లలో నడిచే ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. మధురవాడ పరిసర ప్రాంతాలైన వాంబేకాలనీ, కొమ్మాది, పీఎంపాలెం, మారికవలస తదితర ప్రాంతాలలో నామమాత్రంగా బస్సులు నడుపుతున్నారు. అవి కూడా సమయ పాలన లేకపోవడంపై ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వాంబేకాలనీ–విశాఖ మధ్య నడిచే 25డి/వీ మధురవాడ డిపోనకు చెందిన బస్సులు పరిస్థితి మరీ అధ్వానంగా ఉందని ఆ ప్రాంతా వాసులు తెలిపారు. ఈ రూట్‌లో అరగంటకు ఒక్క బస్సు ఉందని అధికారులు ప్రకటిస్తున్నా.. ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. మధ్యాహ్న సమయాల్లో సమయానికి బస్సులు నడపకుండా డిపోల్లోనే కాలక్షేపం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి సమయానికి బస్సులు నడపాలని పలువురు కోరుతున్నారు.


వాంబే కాలనీ–విశాఖ మధ్య నడిచే 25డీ/వీ బస్సు

నేడు అప్పన్న ఆలయంలో శాంతి హోమం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం శాంతి హోమం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు ఆలయ కల్యాణమండపంలో హోమాన్ని జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఎంఈవోకు వినతి

తగరపువలస: ఉపాధ్యాయుల సమస్యలపై ఎంఈవో గంగరాజుకు ఆనందపురం మండల యూటీఎఫ్ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అత్యవసర సెలవులు తీసుకోవడంలో సమస్యగా ఉన్నందున వర్క్ అడ్జస్ట్‌మెంట్ అనంతరం మిగిలిన ఉపాధ్యాయులను సింగిల్ టీచర్ పాఠశాలలకు ట్యాగ్ చేయాలని కోరారు. పలు సమస్యలను వారు ఎంఈవో దృష్టికి తీసుకువెళ్లారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు టి.ఆర్.అంబేడ్కర్, ఉప్పాడ రాము, సీహెచ్ అవతారం పాల్గొన్నారు.